క్లుప్తంగా

నేడు టెండర్ కం బహిరంగ వేలం

నందిగామటౌన్:మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయానికి సంబంధించి ఆయా వ్యాపార హక్కులకు ఈనెల 30న టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ హరిగోపీనాథ్ బుధవారం తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో గురువారం ఉదయం 11 గంటలకు అమ్మవారి ఫోటో ఫ్రేమ్స్, స్టిక్కర్లు, వగైరా అమ్ముకునే హక్కుకు, పాల పొంగళ్ల షెడ్డు నిర్వహణకు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. దేవదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే ఈ వేలం పాటల్లో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని ఈఓ కోరారు.

మిర్చి తోటల పరిశీలన



జగ్గయ్యపేట:మండలంలోని రామచంద్రుని పేట, తక్కెళ్లపాడు గ్రామాల్లో ఇటీవల తెగుళ్లతో దెబ్బతిన్న మిర్చి పంటలను జిల్లా ఉద్యానశాఖాధికారి బాలాజీనాయక్, గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. రైతులు వినియోగించిన రసాయన మందుల డబ్బాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఉద్యానవనశాఖాధికారి మాట్లాడుతూ మిర్చి పంటలో వడలు తెగులు ఉధృతంగా ఉందన్నారు. రైతులు పంటల మార్పిడి చూసుకోవాలని, నీటి తడులు అధికంగా ఉన్నా వడలు తెగులు సోకుతుందని వివరించారు. మిర్చి తోటలు దెబ్బతిన్న రైతులు నష్టపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణంరాజు, అచ్యుతరాజు, శివప్రసాద్, వెంకటరెడ్డి, జగ్గయ్యపేట ఉద్యానశాఖాధికారి వర్ధిని, వీఏవో అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కంచికచర్ల: మహిళను వేధిస్తున్న ఓ వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన కె.శివకృష్ణ అనేవ్యక్తి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వేధిస్తున్నాడు. అయితే ఈ విషయం గురించి గ్రామపెద్దలకు తెలియజేయగా ఆ వ్యక్తిని మందలించారు. కాని ఆ వ్యక్తిలో మార్పురాక మరలా ఆ మహిళను వేధిస్తుండటంతో బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కంచికచర్ల: త్వరలో జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని ఓపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు స్టడీ మెటీరియల్స్ ఎంతగానో దోహదపతుందన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ నాయక్, హెచ్ఎం సుబ్బారెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: న్యాయవాది బెజవాడ బిక్షమయ్యపై పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తూ జగ్గయ్యపేట న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం తమ విధులు బహిష్కరించి స్థానిక కోదాడ రోడ్‌లోని కోర్టు ఎదురుగా ఉన్న స్థలంలో రిలే నిరాహార దీక్ష చేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ పోలీసుల చర్యలను ఖండించారు. రిలే నిరాహారదీక్షల్లో న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, యర్రమాజు ధనుంజయుడు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, దాసరి నాగేశ్వరరావు, పూలనాగరాజు, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, కరిసె రత్నబాబు, రావూరి ప్రసాద్, ప్రతాపరెడ్డి, జగ్జీవన్‌రావు, శ్రీధర్, అశోక్, శేషకుమారి, అమ్ములు పాల్గొన్నారు.

పర్యాటకం..ప్రశ్నార్థకం!

- కృష్ణానది తీర గ్రామాలైన ముక్త్యాల, వేదాద్రి పర్యాటకానికి అనుకూలం
- పట్టించుకోని పాలకులు



వేదాద్రిలో కృష్ణానది ఒడ్డున ఉన్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం

జగ్గయ్యపేట: పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. జగ్గయ్యపేట మండలంలోని కృష్ణానది తీరంలో గల ముక్త్యాల, వేదాద్రి గ్రామాలు పర్యాటక ప్రాంతానికి ఎంతో అనువుగా ఉన్నప్పటికీ ఆ గ్రామాలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఈ ప్రాంతంలో పర్యాటకం ప్రశ్నార్థకంగా మారింది.

నిత్యం కృష్ణమ్మ పరుగులు...

ముక్త్యాల గ్రామ సమీపంలో 2004–05లో అప్పటి ఉమ్మడి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పులిచింతల ప్రాజెక్ట్ నిర్మించడంతో కృష్ణానదిలో 365రోజులు నీటి ప్రవాహం ఉంటోంది. వరదల సమయంలో మినహా మిగిలిన సమయాల్లో అవతలి ఓడ్డు నుంచి ఇవతలి ఓడ్డు వరకు పడవలో రాకపోకలు సాగుతున్నాయి. కృష్ణమ్మ అందమే పెద్ద ఆభరణంగా వర్ణించవచ్చు. ముఖ్యంగా నది పక్కన పచ్చని పొలాల నడుమ దేవాలయాలు, కొండలు నది మధ్యలో కొండల అందాలు సందర్శకులను ఎంతో కనువిందు చేస్తాయి. ముఖ్యంగా సినిమా షూటింగ్‌లకు అనువైన ప్రాంతం. ఈప్రాంతంలో ముక్త్యాల ముగ్గు సినిమా పూర్తిస్థాయిలో షూటింగ్ జరిగింది. అంతేకాకుండా నది ఒడ్డున 200ఏళ్ల కిందట వాసిరెడ్డి రాజాకేశవప్రసాద్ (ముక్త్యాల రాజా) నిర్మించిన కోట నేటికి ఈ ప్రాంతానికి చారిత్రాత్మకంగా నిలుస్తుంది. సమీపంలోని కోటి లింగాల హరిహరమహాక్షేత్రం ఎంతో ప్రాశస్త్యం పొందింది.



కృష్ణానది ఒడ్డున ఉన్న ముక్త్యాల కోట

పర్యాటకులను ఆకట్టుకుంటున్న వేదాద్రి...

గ్రామంలోని కృష్ణానది ఒడ్డున వేంచేసి ఉన్న యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఆధ్యాత్మికంతోపాటు పర్యాటకంగా ఆకట్టుకుంటోంది. నది ఒడ్డున క్షేత్రం ఉండటంతోపాటు, నది మధ్యలో సాలగ్రామ నరసింహస్వామి, 500 అడుగుల ఎత్తులోని కొండల మధ్య జ్వాల నరసింహస్వామి కొలువుతీరి ఉంటారు. ఆలయానికి నిత్యం అవతలి ఒడ్డు నుంచి పడవలపై తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు నిత్యం వస్తుంటారు. అంతేకాకుండా ఈ ప్రాంతం అంతా అటవీ ప్రాంతం కావడంతో వన్యప్రాణులు కనువిందు చేస్తుంటాయి.



నిరుపయోగంగా మారిన ఫుడ్‌కోర్టు

నిరుపయోగంగా ఫుడ్‌కోర్ట్...

2016లో జరిగిన కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి ప్రభుత్వం సుమారు రూ.40లక్షల వ్యయంతో ఏపి టూరిజంశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఫుడ్‌కోర్ట్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ముక్త్యాల నుంచి వేదాద్రి వరకు నదిలో టూరిజం బోటులో షికారు చేసే పర్యాటకుల కోసం నిర్మించినప్పటికి టూరిజం శాఖ పదేళ్లుగా ఈ ఫుడ్‌కోర్టును వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో ఫుడ్‌కోర్టు అంతా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

ఇక బోటు షికారు ఊసే లేదు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో పర్యాటకరంగ అభివృద్ధి ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో అభివృద్ధికి కృషిచేయాలని పర్యాటకులు, జగ్గయ్యపేట ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మోసం..చంద్రబాబు నైజం

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తన్నీరు



విలేకరులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన ఎంపీపీ గాంధీ, మనోహర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికల సమయంలో అలవికాని హామీలిస్తూ ప్రజలను నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలకు రెట్టింపు స్థాయిలో పథకాలను అందిస్తానంటూ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, తీరా ఇప్పుడు ఆర్థికభారం పేరుతో సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయలేనని చేతులెత్తేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు ఆపదవిలో కొనసాగే అర్హత లేదని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తన్నీరు నాగేశ్వరరావు బుధవారం విలేకరులతో మాట్లాడారు. పథకాల అమలుపై సీఎం చంద్రబాబు ద్వంద వైఖరిని తూర్పారబట్టారు. నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి పేరుతో సంపద సృష్టించాకే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని పేర్కొనడం చంద్రబాబు అనైతిక రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చే సమయంలో రాష్ట్ర ఆర్థికపరిస్థితి గుర్తులేదా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున ఆయా పథకాల అమలుకు తమపార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సంపద సృష్టించి పేదలకు పంచుతానని ప్రకటించిన చంద్రబాబు గత 14ఏళ్ల పాలనలో సృష్టించిన సంపద ఎంతో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. ఇదే బడ్జెట్లతో గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి డీబీటీ రూపంలో రాష్ట్రప్రజలకు నేరుగా రూ.2.70లక్షల కోట్లను అందించారని గుర్తుచేశారు. బటన్ నొక్కడం ముసలమ్మ అయినా చేస్తుందంటూ నాడు సన్నాయి నొక్కులు నొక్కిన చంద్రబాబు నేడు అదే బటన్ నొక్కి పేదలకు ఆయా పథకాలను ఎందుకు అందించలేకపోతున్నారో సమాధానం చెప్పాలన్నారు. గత 8నెలలపాలనలో ఇప్పటివరకు రూ.70వేల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు, పింఛన్లు మినహా మరే పథకాన్ని అమలుచేయని వైనాన్ని గుర్తుచేశారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామంటూ నమ్మించి మోసం చేసిన సీఎం చంద్రబాబుపై చీటింగ్ కేసు ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలుచేయని కూటమి నాయకులకు రాష్ట్రాన్ని పాలించే అర్హత, నైతికత లేదన్నారు. ఇకనైనా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు అమలుచేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఆపార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



కె.అగ్రహారంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, అన్నవరం, బలుసుపాడు, బూదవాడ, గండ్రాయి, జయంతిపురం, కెఅగ్రహారం, మల్కాపురం గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఫిబ్రవరి నుంచి చెత్త నుంచి సంపద తయారీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మావతి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల్లో ఏఐ ప్రాముఖ్యత పెరిగింది



లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్పొరేట్ సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యం పెరిగిందని ఎడ్యూస్కిల్స్ అసోసియేట్ మేనేజర్, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రెనర్ ఎస్వి పవన్‌కుమార్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆల్టరీక్స్ డేటా ఎనలిటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ అనే అంశంపై వర్క్‌షాపు జరిగింది. పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతికత గురించి , డేటా ఎనలిటిక్స్‌లో వివిధ టెక్నిక్స్‌ని సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రిన్సిపాల్ ఎం .అనురాధ, పి. దుర్గాభవాని పాల్గొన్నారు.

అమ్మ భక్తులకు 'దారి' కష్టాలు

- మక్కపేట నాలుగు రోడ్ల కూడలిలో సమస్య
- శాశ్వత స్వాగత ద్వారం ఏర్పాటుకు భక్తుల వినతి



మక్కపేట సెంటర్‌లో గతేడాది తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం (ఫైల్)

వత్సవాయి: పుణ్యక్షేత్రం పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. శుక్ర, ఆదివారాలలో భక్తుల సంఖ్య వేలల్లో ఉంటుంది. అయితే భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడడంలో మాత్రం దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అమ్మవారి దేవాలయానికి వచ్చే భక్తులలో ఎక్కువ శాతం గుంటూరు, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన భక్తులు వస్తుంటారు. నల్గొండ జిల్లా నుంచి వచ్చే వారు జాతీయ రహదారిపై వచ్చి చిల్లకల్లు నుంచి వైరా రహదారిలో మక్కపేట మీదుగా పెనుగంచిప్రోలు వెళ్తుంటారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి వచ్చేవారు బోనకల్లు నుంచి మక్కపేట మీదుగా వెళ్లాల్సివుంది. అయితే నాలుగు రోడ్ల కూడలిగా ఉన్న మక్కపేట నుంచి పెనుగంచిప్రోలు ఎటు వెళ్లాలో తెలియక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాలలో వచ్చే భక్తులకు మక్కపేటలో దారి తెలియక ఐదారు కిలో మీటర్ల వరకు వేరే దారిలో వెళ్లుతున్నారు. భక్తుల సమస్యను దృష్టిలో ఉంచుకుని దేవాదాయశాఖ అధికారులు మక్కపేట వద్ద పెనుగంచిప్రోలు వెళ్లే దారిలో శాశ్వతంగా ఆర్చీని నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. ఏటా రెండు నెలల వ్యవధిలో రెండుమార్లు తాత్కాలిక ద్వారాలను ఏర్పాటు చేస్తూ అద్దెకింద రూ.లక్షలు చెల్లిస్తుండటం గమనార్హం.

ఆలయ అధికారులు దృష్టిపెట్టాలి ...

తిరుపతమ్మ అమ్మవారి ఆలయంకు వెళ్లే భక్తులు దారి తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మరింత కష్టంగా మారింది. దారి చెప్పే వారు లేక దూరం వెళ్లి తిరిగి వెనకకు వచ్చిన సంఘటనలు కోకొల్లలు. మక్కపేట సెంటర్‌లో ఎటువైపు వెళ్లాలో దూరం నుంచి వచ్చే భక్తులకు అర్థంకావటం లేదని సర్పంచి వడ్డే పరమయ్య తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు కనగాల రమేష్ మాట్లాడుతూ ఆలయ అధికారులు శాశ్వతస్వాగత ద్వారం నిర్మించాలని కోరారు.

వేటూరి పాట తెలుగు సాహితీ పూలతోట



విజయవాడ కల్చరల్: వేటూరి పాట తెలుగు సాహితీ పూలతోట అని పోలవరపు కోటేశ్వరరావు, జీఆర్‌కే సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు తెలిపారు. గీతాంజలి మ్యూజిక్స్, జీఎస్ మెలోడీస్, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్యా కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద సినీ గేయ రచయిత వేటూరి సుందరరామమూర్తి 89వ జయంతి బుధవారం నిర్వహించారు. గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ వేటూరి పాటలో తెలుగు నుడికారాలు కనిపిస్తాయన్నారు. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ పరిశోధనా సమయంలో ఆయన అనేక విషయాలను ముచ్చటించేవారని, తెలుగు పాటను శాసించిన ఉత్తమ శ్రేణి పాటల రచయిత ఆయన అని అభివర్ణించారు. అతిథులు వేటూరి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, ఆదిరాల జయప్రభ, శ్యాంప్రసాద్, ప్రభల శ్రీనివాస్, కారుమంచి రాజు, చలపతిరావు, రాజ్ కిషోర్ పాల్గొన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు



జయంతిపురంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్

పెనుగంచిప్రోలు: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయని, ఆయా గ్రామ కూడళ్లల్లో తప్పకుండా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మునేరు అవతల కేవీఆర్ గార్డెన్‌లో బుధవారం గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ కూడళ్లు, దుకాణాలతోపాటు వ్యక్తిగతంగా కూడా ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. గ్రామ కూడళ్లలో ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో చోటుచేసుకునే చిన్నపాటి తగాదాలు, ఘర్షణలు పోలీస్‌స్టేషన్ వరకు రాకుండా పరిష్కరించుకోవచ్చని గ్రామాల్లోనే పరిష్కరించుకునేందుకు వీలుగా సురక్ష కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటేశ్వరి, ఆలయ మాజీ చైర్మన్లు వాసిరెడ్డి బెనర్జీ, అత్తలూరి అచ్యుతరావు, బీజేపీ నాయకులు కర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయంతిపురంలో..

జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ సూచించారు. మండలంలోని జయంతిపురం గ్రామ సచివాలయం వద్ద బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యంగా ఉండి కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీలను అరికట్టవచ్చన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బండ్ల ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి ఇమాం, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులతో ఐక్యంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఆర్టీవో పద్మావతి, ఎంపీఐ పూర్ణిమ తదితరులు

నందిగామటౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం అత్యంత ప్రమాదకరమని నందిగామ రవాణా శాఖాధికారి పద్మావతి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అనాసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాకతీయ విద్యా సంస్థల విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కారు ప్రయాణికులు తప్పకుండా సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. తద్వారా ప్రమాదసమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రతపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ పూర్ణిమ, పరిపాలన అధికారి ప్రభాకర లింగం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, కాకతీయ ప్రిన్సిపాల్ రవీంద్ర, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అయిలపోగు'కు నేతల నివాళి



నాగేశ్వరరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అయిలపోగు నాగేశ్వరరావు(95) అనారోగ్యంతో మృతిచెందగా, విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాగేశ్వరరావు ఎంతో కృషిచేశారని, ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నాగేశ్వరరావుకు నివాళులర్పించిన వారిలో వీరులపాడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్‌సీపీ వీరులపాడు మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు షహనాజ్‌బేగం, కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ కాలవ పెదబాబు, నందిగామ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందా వజ్రయ్య సీఐటీయూ నాయకులు కోట కళ్యాణ్, షేక్ గౌస్, ఎం.సోమేశ్వరరావు, బెజ్జం భూషణం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రాజెక్టు అధికారులు



ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను కలిసిన పులిచింతల ప్రాజెక్టు అధికారులు

జగ్గయ్యపేటఅర్బన్:ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను పులిచింతల ప్రాజెక్టు అధికారులు బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రాజెక్టు సర్కిల్, విసన్నపేట ఎస్ఈ మొహిద్దీన్, పులిచింతల ప్రాజెక్టు ఈఈ గుణకరరావు, ఎన్ఎస్‌పీ ఈఈ ఆర్.సంతోష్, డీఈఈలు కిషోర్, అరుణకుమారి, రాంబాబు, లలిత, ఏఈలు విక్రమ్, ప్రసాద్, ఆశ్యా, రాజు, శంకరనాయక్, గోపాలరావునాయక్, శోభ కలిసి శాఖాపరమైన పనులపై సమీక్షించారు. కాలువలకు సంబంధించి చిన్నచిన్న మరమ్మతులు, పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, నూజివీడు పరిధిలోని పనులపై మెయింటెనెన్స్ తదితర పనుల నిమిత్తం రూ.3.60కోట్లు అవసరమవుతాయని పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డీసీ–1 చైర్మన్ ఏలూరి గోపాలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



పట్టాభిని కలిసి మాట్లాడుతున్న రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ఎర్రకాలువ, వేపలవాగు ప్రక్షాళనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిని కోరారు. విజయవాడలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం పట్టాభిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేసినట్లు చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ పేట డంపింగ్‌యార్డులోని లెగసీ మొత్తాన్ని క్లియర్ చేయడానికి సహకరించాలని కోరినట్లు చెప్పారు. పట్టణంలో వార్డులు పెరిగినందున చెత్త సేకరణకు కావలసిన డంపింగ్ బిన్‌లు, ఎలక్ట్రికల్ ఆటోలు, పుష్‌గార్డులు ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన వివరించారు.